# హిజ్కియా

హిజ్కియా అనే పేరుకు 'యెహోవా నా బలం' అని అర్థం. ఇతని తండ్రి అహాజా, తల్లి అబీ న్యాయవిరుద్ధంగా ఏలిన అతల్యాను మినహాయిస్తే దక్షిణ రాజ్యాన్ని (యూదా ) పాలించిన రాజుల్లో హిజ్కియా పండ్రెండవ రాజు. బైబిల్లో వున్న ఆధారాలతో హిజ్కియా పరిపాలనా కాలాన్ని కచ్చితంగా నిర్ణయించడం కష్టం. క్రీ.పూ.729 నుంచి పదు నాలుగు సంవత్సరాలు హిజ్కియా తన తండ్రితో కలిపి పాలించాడు. హిజ్కియాకు ఇరవై సంవత్సరాల వయస్సు వచ్చినప్పటినుండి నుంచి (క్రీ.పూ.716-687 వరకు) అతను స్వతంత్రంగా పరిపాలించాడు.

హిజ్కియా పరిపాలనలోని ముఖ్యఘట్టాలు: మత సంస్కరణలు, తూర్పున వున్న శక్తిమంతమైన అష్షూరును నిరంతరం ప్రతిఘటించడం. హిజ్కియా స్థానిక కనాను దేవతల బలిపీఠాలను తొలగించడమే కాక యెరూషలేంలో తన తండ్రి మూసివేసిన మందిర ద్వారాలను తిరిగి తెరిచాడు (2దిన 28:24). ఇతను మందిరంలో తన తండ్రి ప్రతిష్ఠించిన అష్షూరు విగ్రహాలను కూడ తొలగించాడు. మోషే అరణ్యంలో ఎత్తిన ఇత్తడి సర్పానికి ప్రజలు పూజలు చేసి ధూపం వేస్తున్నారు గనుక హిజ్కియా దాన్ని కూడ పగులగొట్టాడు (సంఖ్యా 21 :4-9). హిజ్కియా తన తండ్రి తొలగించిన పవిత్ర ఉపకరణాలను తిరగి తెచ్చి, లేవి గోత్రం వారి యాజకత్వ విధులను క్రమబద్ధీకరించారు. యాజకులు బలిపీఠాన్ని శుద్ధిచేసి, మోషే ధర్మశాస్త్రం ప్రకారం బలులర్పించేలాగా వీలు కల్పించాడు. అష్షూరు పరిపాలనలో వున్న ఉత్తరరాజ్యాన్ని (ఇశ్రాయేలు) తనతో కలిపి సస్కాపండుగ నాచరించమని దయార్ద్ర హృదయంతో ఆహ్వానించాడు (2 రాజులు 18:1-8:2 దిన29:1-31:21).

హిజ్కియా తండ్రి అహాజు యెషయా ప్రవక్త హెచ్చరికలను విస్మరించి, యూదా రాజ్యం అష్షూరుపై ఆధారపడేలా చేశాడు. అయితే, హిజ్కియా తన తండ్రి విధానాలకు ముగింపు పలికి పాలస్తీనా సిరియా ప్రాంతాలపై అష్షూరు ఆధిపత్యాన్ని సవాలుచేస్తూ వారిపై తిరుగుబాటు చేశాడు. రెండవ సర్గోను క్రీ.పూ. 721లో ఉత్తరరాజ్యాన్ని జయించి (2రాజులు 17: యెషయా 20:1). అష్డోదు నగరాన్ని ఆక్రమించినప్పుడు అతనిపై దాడికి హిజ్కియా యెరూషలేంను సిద్ధం చేశాడు. హిజ్కియా యెరూషలేం ప్రాకారాలను పటిష్టపరచి, సైన్యాన్ని అప్రమత్తం చేసి, పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా గీహోను నీటిబుగ్గ నుంచి షిలోహు వరకు సొరంగాన్ని త్రవ్వించాడు. క్రీ.పూ. 701లో సర్గోను కుమారుడు సన్హెరీబు ఈ తిరుగుబాటుకు అణచివేసి యూదాలో ప్రాకారాలున్న పట్టణాల్లో నలభై ఆరు పట్ట

ణాలను పట్టుకొన్నాడు. యెరూషలేంను మినహాయిస్తాడనే ఆశతో హిజ్కియా పెద్ద ఎత్తున వెండి బంగారాలను అతనికి కానుకగా సమర్పించాడు. అయినా, యెరూషలేంను లొంగి పొమ్మని సన్హెరీబు ఆదేశించాడు. ఈ లోగా అష్షూరు సైన్యంలో ప్రాణాంతకమైన తెగులు పుట్టింది. దేవుడు యెరూషలేంను అద్భుతరీతిలో కాపాడాడు (2రాజులు 18ం17-19:37:2 దిన 32:1-33: యెషయా 36-39 అధ్యాయాలు).

ఈ సంఘటనల తర్వాత,హిజ్కియాకు ప్రాణాంతకమైప వ్యాధి వచ్చిందని బైబిలు తెలియ జేస్తుంది. (యెషయా 38:1:2 రాజులు 20:1)కష్టకాలంలో హిజ్కియా దేవునికి మొరపెట్టాడు. హిజ్కియా ప్రార్థనకు జవాబు వచ్చింది. హిజ్కియాను యెరూషలేంకు తాను అష్షూరీయుల నుంచి కాపాడతానని దేవుడు యెషయా ద్వారా తెలియజేసాడు. అంజూరపు పండ్లముద్దను హిజ్కియా గాయాలకు పూయమని యెషయా రాజసేవకులకు ఆదేశించగా, రాజు బాగు పడ్డాడు. అప్పుడు, యెషయా 38:10-20లోని 'స్తుతిగీతాన్ని' హిజ్కియా రచించాడు.